# క్రైం కౌంటర్

webisite:www.crimecounter.in
ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం
తెలుగు దిన పత్రిక

సంపుటి : 02 సంచిక : 139 క్రిష్ణా, శుక్రవారం 13 - 02 - 2026 పేజిలు : 4 వెల. 2 /-



రిపోర్టర్లు కావలెను

క్రైం కౌంటర్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో
- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జీలు
- నియోజక వర్గ ఇన్‌చార్జీలు
కావలెను.

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు
98497 07349


## వీరమ్మ తల్లి కృపాకటాక్షాలతో రాష్ట్ర ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలి

### వై.వి.బి.రాజేంద్రప్రసాద్





**ఉయ్యూరు, ఫిబ్రవరి 12 (క్రైం కౌంటర్ ప్రతినిధి) :** ఉయ్యూరులో గత 15 రోజుల క్రితం అంగరంగ వైభవంగా మొదలైన శ్రీ పారుపూడి కనక చింతయ్య వీరమ్మ తల్లి తిరుణాళ్ళు సందర్భంగా 15 వ రోజు ఉయ్యూరు పెద్ద ముఠా వాళ్ల ఆధ్వర్యంలో జరుగుతున్న ఉత్సవాన్ని పెనమలూరు శాసనసభ్యులు బోడె ప్రసాద్ తో పాటుగా ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించిన తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ శాసనమండలి సభ్యులు రాజేంద్రప్రసాద్. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ..., ఉయ్యూరులో గత 15 రోజులుగా అమ్మవారి సంబరాలు అంబరాన్ని అంటుతున్నాయని, భక్తులు కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ వీరమ్మ తల్లి అని ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా ఆఖరి రోజున పెద్ద ముఠా వాళ్ల ఆధ్వర్యంలో చాలా పెద్ద ఎత్తున అమ్మవారి సంబరం ఏర్పాటు చేయడం సంతోషకరమని రాజేంద్రప్రసాద్ అన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ పార్టీ అధ్యక్షులు జంపాన గురునాధ రావు, మాజీ మున్సిపల్ చైర్మన్, తాడిగడప మున్సిపాలిటీ అధ్యక్షులు ప్రభాకర్, జిల్లా యూత్ అధ్యక్షులు దండమూడి చౌదరి, క్లస్టర్ ఇంచార్జ్ కూనపరెడ్డి వాసు, రాజులపాటి ఫణి, చలపాటి శ్రీను, నరేష్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## ఆగ్రో ప్రాసెసింగ్ క్లస్టర్‌లకు ప్రోత్సాహం : ఎంపీ పుట్టా మహేష్ కుమార్



**ఏలూరు, ఫిబ్రవరి 12 ( క్రైం కౌంటర్ ప్రతినిధి) :** ప్రధాన్ మంత్రి కిసాన్ సంపద యోజన పథకంలో భాగంగా వ్యవసాయ ప్రాసెసింగ్ క్లస్టర్లను స్థాపించడానికి పెట్టుబడిదారులకు గ్రాంట్-ఇన్-ఎయిడ్/ సబ్సిడీ రూపంలో ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి రవ్నీత్ సింగ్ వెల్లడించారు. గత ఐదు సంవత్సరాలలో ఈ పథకం కింద ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2 వ్యవసాయ ప్రాసెసింగ్ క్లస్టర్లను ఆమోదించినట్లు తెలిపిన కేంద్ర మంత్రి అందులో ఒకటి ఏలూరు జిల్లాకు, మరొకటి విజయనగరం జిల్లాలోనూ మంజూరు చేశామని చెప్పారు. 25.85 కోట్ల వ్యయంతో ఏలూరు జిల్లాలో ఏర్పాటు చేయబోయే క్లస్టర్ (రమణ్ సింగ్ గ్లోబల్ ఫుడ్ పార్కు, నూజివీడు మండలం మొర్సపూడి గ్రామం)కు ఇటీవలే శంకుస్థాపన కూడా జరిగిన విషయం తెలిసిందే. 2017 నుండి దేశంలో క్లస్టర్ విధానం ఆధారంగా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేయడానికి పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తున్నట్లు కేంద్ర మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడిన..., ఎంపీ పుట్టా మహేష్ కుమార్ వ్యవసాయ ప్రాసెసింగ్ క్లస్టర్లలో మౌలిక సదుపాయాల సృష్టి ( ఏపీసి) కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ఆమోదించబడిన ప్రాజెక్టులు త్వరగా పూర్తి చేసేందుకు కూడా తగిన సహాయ సహకారాలు అందించాలని కేంద్ర మంత్రిని కోరారు.

## పోస్టల్ ఉద్యోగిని ఘనంగా సత్కరించిన సి.జి.హెచ్.ఎస్ డాక్టర్లు



**గుంటూరు, ఫిబ్రవరి 12 ( క్రైం కౌంటర్ ప్రతినిధి) :** పోస్టల్ డిపార్ట్మెంట్ లో మూడున్నర దశాబ్దాలు విశేష సేవలందించి, ఉద్యోగ విరమణ చేసిన పోస్టల్ అసిస్టెంట్ దేసు సుబ్బారావును సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీమ్ (సిజిహెచ్‌ఎస్) డాక్టర్లు, ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. గురువారం నగరంపాలెం లోని సిజిహెచ్‌ఎస్ వెల్నెస్ సెంటర్ లో జరిగిన కార్యక్రమంలో దేసు సుబ్బారావు దంపతులను సిజిహెచ్‌ఎస్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ టి.సిహెచ్.కోటేశ్వరరావు, సీనియర్ మెడికల్ ఆఫీసర్ కొండా నాగార్జున తదితరులు పట్టు శాలువాతో సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కోటేశ్వరరావు మాట్లాడుతూ..., పోస్టల్ శాఖకు, సిజిహెచ్‌ఎస్ కు ఎంతో అవినాభావ సంబంధం ఉందన్నారు. గుంటూరు సిజిహెచ్‌ఎస్ ఏర్పాటుకు దేసు సుబ్బారావు ఎన్నో సహాయ సహకారాలు అందించారని కొనియాడారు.సీనియర్ మెడికల్ ఆఫీసర్ కె.నాగార్జున మాట్లాడుతూ..., పోస్టల్ శాఖ ఇచ్చిన ప్రోత్సాహం, సహకారంతోనే సిజిహెచ్ఎస్ వైద్యశాలలన్ని పోస్టల్ శాఖ భవనాల్లోనే కొనసాగుతున్నాయన్నారు.దేసు సుబ్బారావు మాట్లాడుతూ..., తనను సొంత స్టాఫ్ గా భావించి, ఘనంగా వీడ్కోలు చెబుతున్న సిజిహెచ్‌ఎస్ డాక్టర్లకు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిజిహెచ్‌ఎస్ లోకల్ అడ్వైజరీ కమిటీ సభ్యులు గుమ్మడి సీతారామయ్య చౌదరి, ఉద్యోగులు అయోషా బేగం, సునీల్, పేరేశ్వరరావు, మురళీ, రామారావు, మక్బూల్, వెంకటేశ్వర్లు, రత్నరాజు, నందమణి పాల్గొన్నారు.

## ముస్లిం స్మశాన వాటికను పరిశీలించిన చైర్మన్ చిట్టిబాబు



**ఎన్టీఆర్ జిల్లా,కొండపల్లి,ఫిబ్రవరి 12(క్రైం కౌంటర్ డెస్క్):** పశ్చిమ ఇబ్రహీంపట్నం లోని ముస్లింల స్మశాన వాటికలో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ కు పశ్చిమ ఇబ్రహీంపట్నం ముస్లింలు వినతి పత్రం అందజేశారు.ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ ఆదేశాల మేరకు కొండపల్లి పురపాలక చైర్మన్ మరియు ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి చెన్నుబోయిన చిట్టిబాబు గురువారం నాడు పరిశీలించారు.ఈ సందర్భంగా స్థానిక ముస్లింలు స్మశాన వాటికలో మౌలిక సదుపాయాలు కల్పించాలని చైర్మన్ చిట్టిబాబు దృష్టికి తీసుకు వచ్చారు.ఆయన వెంటనే స్పందించి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమం లో కొండపల్లి మునిసిపాలిటీ ఏఈ మౌస్మీ గనియా, కో ఆప్షన్ సభ్యులు మహబూబ్ సుభాని,మసీదు ముతవల్లీ ముస్తాఫా,పటాన్ రఫీ,ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

## ఖనిజాల అన్వేషణ ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇవ్వాలి

### : ఎంపీ పుట్టా మహేష్ కుమార్

- వ్యూహాత్మక ఖనిజాల అన్వేషణ, అభివృద్ధికి ప్రాధాన్యం...
- దేశవ్యాప్తంగా 273 ప్రాజెక్టులకు అనుమతి...
- ఏపీలో 5 ప్రాజెక్టులు చేపట్టిన ఎన్ఎంఈటి...



**ఏలూరు, ఫిబ్రవరి 12 (క్రైం కౌంటర్ ప్రతినిధి) :** నేషనల్ మినరల్ ఎక్స్‌ప్లోరేషన్ అండ్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఎన్ఎంఈటి) కింద ఆంధ్రప్రదేశ్ సహా దేశవ్యాప్తంగా,హా అనేక గనుల అన్వేషణ మరియు అభివృద్ధి ప్రాజెక్టులు చేపట్టినట్లు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి తెలిపారు. దేశ అభివృద్ధికి కీలకమైన వ్యూహాత్మక ఖనిజాల అన్వేషణ, అభివృద్ధి (ఎన్ఎంఈటి) పనులపై వివరాలు కోరుతూ ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అడిగిన ప్రశ్నకు లోక్ సభలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి సమాధానం ఇచ్చారు. కేంద్ర మంత్రి ఇచ్చిన వివరాల ప్రకారం వ్యూహాత్మక ఖనిజాల అన్వేషణ, అభివృద్ధి కోసం దేశవ్యాప్తంగా మొత్తం 289 ప్రాజెక్టులు చేపట్టగా వీటిలో 273 ప్రాజెక్టులకు ఇప్పటికే అనుమతివ్వగా, మరో 16 ప్రాజెక్టులు ప్రతిపాదనల్లో ఉన్నాయి. ఈ ప్రాజెక్టుల కోసం మొత్తం 1729.35 కోట్ల నిధులు కేటాయించగా 922.83 కోట్ల నిధులు ఇప్పటికే విడుదల చేశారు. ఏపీకి సంబంధించిన 5 ప్రాజెక్టులకు అనుమతివ్వగా, మరొక ప్రాజెక్టు ప్రతిపాదన దశలో ఉన్నదని తెలిపారు. ఏపీకి సంబంధించిన ప్రాజెక్టుల్లో ప్రభుత్వ సంస్థలతోపాటు మూడు ప్రైవేటు సంస్థలకు కూడా అనుమతి ఇచ్చినట్లు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కు ఇచ్చిన సమాధానంలో మంత్రి తెలిపారు. వీటిలో జియో మెరైన్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, క్రిటికల్ మినరల్ ట్రాకర్, మైనింగ్ టెక్ కన్సల్టెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ ఉన్నాయి. నేషనల్ మినరల్ ఎక్స్‌ప్లోరేషన్ అండ్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఎన్ఎంఈటి) కింద చేపట్టిన ఈ ప్రాజెక్టులలో 43 ప్రాజెక్టులతో గుజరాత్ దేశంలో మొదటి స్థానంలో ఉండగా, 32 ప్రాజెక్టులతో మధ్యప్రదేశ్ రెండో స్థానంలో ఉంది. ఏపీలో అనుమతించిన ప్రాజెక్టులకు 66.67 కోట్లు కేటాయించగా 30.15 కోట్లు ఇప్పటికేహా విడుదల చేశారని, ఆయా ప్రాజెక్టులు కార్యాచరణలో ఉన్నాయని కేంద్ర మంత్రి వెల్లడించారు. ఈ సందర్భంగా ఏపీలో వ్యూహాత్మక ఖనిజాల అన్వేషణ ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్రాన్ని కోరినట్లు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తెలిపారు.

## కొలికపూడి శ్రీనివాస్ పై మరోసారి ఆగ్రహం వ్యక్తం చేసిన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు



**క్రైమ్ కౌంటర్ న్యూస్):** తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్ వ్యవహారశైలిపై ఇటీవల విమర్శలు వస్తుండడంతో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఈ రోజు అసెంబ్లీ లాబీలో కొలికపూడితో పల్లా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పార్టీతోనే ఆయనకు గుర్తింపు వచ్చిందని, వ్యక్తిగతంగా ఆయన జీరో అనే విషయాన్ని గుర్తించాలంటూ పల్లా శ్రీనివాస్ హితవు పలికారు. అది గుర్తించి నడుచుకోవాలని సూచించారు.పార్టీ లైన్ దాటితే ఉపేక్షించబోమని టీడీపీ అధినేత చంద్రబాబు ఆదేశాలను కొలికపూడికి తెలియజేశారు. వాట్సప్ స్టేటస్ లతో ఎవరిపై పోరాటం చేస్తున్నారని పల్లా ఆయనను నిలదీశారు. మందలించినా కూడా పద్ధతి మార్చుకోకుంటే పార్టీ ఆయనను ఎమ్మెల్యేగా గుర్తించడం మానేస్తుందని స్పష్టం చేశారు.

# కేసరపల్లికి కస్టమ్స్ కార్యాలయం : ఎమ్మెల్యే యార్లగడ్డ



**గన్నవరం ఫిబ్రవరి 12 ( క్రైం కౌంటర్ ప్రతినిధి) :** గన్నవరం నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ కృషితో కేసరపల్లిలో కస్టమ్స్ కార్యాలయాల ఏర్పాటుకు మార్గం సుగమమైంది. ప్రస్తుతం విజయవాడ, గుంటూరు ప్రాంతాల్లో అద్దె భవనాల్లో కొనసాగుతున్న కస్టమ్స్ ప్రివెంటివ్ కమిషనరేట్, సెంట్రల్ ఎక్సైజ్ మరియు సర్వీస్ టాక్స్ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించేందుకు వీలుగా ప్రభుత్వం 3.84 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. కేసరపల్లిలోని సర్వే నంబర్ 29/8లో ఈ భూమిని కేటాయిస్తూ రాష్ట్ర మంత్రివర్గం బుధవారం జరిగిన సమావేశంలో ఆమోదముద్ర వేసింది. ఇక్కడ కేవలం కార్యాలయ భవన సముదాయమే కాకుండా, అధికారులు మరియు సిబ్బంది కోసం నివాస గృహాలను కూడా నిర్మించనున్నారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ ఈ ప్రాజెక్టుపై ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రభుత్వం నుండి అనుమతులు వచ్చేలా చేయడంతో, త్వరలోనే ఈ కార్యాలయాలన్నీ కేసరపల్లిలో కొలువుదీరనున్నాయి.

# ఇబ్రహీంపట్నం డిపో లో నిరసన తెలిపిన ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ యూనియన్..



**ఎన్టీఆర్ జిల్లా,ఇబ్రహీంపట్నం,ఫిబ్రవరి 12(క్రైం కౌంటర్ డెస్క్):** కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక చట్టాలకు నిరసనగా రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపోలో ఉదయం మొదటి డ్యూటీ నుండి ఉద్యోగులు ఎర్ర బ్యాడ్జ్ లు ధరించి కార్మిక వ్యతిరేక విధానాలకు ఆవేదన తో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపో సెక్రటరీ పి. శ్రీనివాసరావు,డిపో ప్రెసిడెంట్ బీవీ ఆంజనేయులు,డిపో ట్రెజరరి వి.ఆంజనేయులు,డిపో వైస్ ప్రెసిడెంట్ బిఎన్.రావు మూర్తి,అహ్మద్, కమిటీ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొని నిరసన తెలిపారు.

# ఏపీ ఇంటర్ పరీక్షల్లో కీలక మార్పులు..

**క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 12 :** ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ బోర్డు 2026 వార్షిక పరీక్షలకు సంబంధించి విద్యార్థులకు కీలక మార్గదర్శకాలను విడుదల చేసింది. ఈ ఏడాది నుంచి పరీక్షల్లో అదనపు సమాధాన పత్రాలను సరఫరా చేసే విధానానికి స్వస్తి పలకాలని బోర్డు నిర్ణయించింది. విద్యార్థులకు కేటాయించిన నిర్ణీత బుక్‌లెట్‌లోనే పూర్తి సమాధానాలు రాయాల్సి ఉంటుంది కాబట్టి, ప్రతి అంశాన్ని స్పష్టంగా, పొదుపుగా రాయడంపై విద్యార్థులు దృష్టి సారించాలని అధికారులు సూచిస్తున్నారు. ముఖ్యంగా ఫస్టియర్ విద్యార్థుల కోసం సబ్జెక్టుల వారీగా పేజీల సంఖ్యలో మార్పులు చేశారు. గణితం, భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం వంటి కీలక సైన్స్ సబ్జెక్టులతో పాటు ఎకనమిక్స్, సివిక్స్, కామర్స్, హిస్టరీ పేపర్ల కోసం ప్రత్యేకంగా 32 పేజీల ఆన్సర్ బుక్‌లెట్‌ను అందజేయనున్నారు. ఈ ప్రధాన సబ్జెక్టులకు ఎక్కువ వివరణ అవసరమవుతుందనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. విద్యార్థులు తమ సమాధానాలను ఈ పరిమితి లోపే ముగించాల్సి ఉంటుంది.

మిగిలిన ఫస్టియర్ సబ్జెక్టులతో పాటు, పెండింగ్‌లో ఉన్న బ్యాక్‌లాగ్ పేపర్లకు మరియు సెకండియర్ విద్యార్థులందరికీ కేవలం 24 పేజీల బుక్‌లెట్‌ను మాత్రమే కేటాయించారు. సెకండియర్ పరీక్షలు రాసే వారు అన్ని సబ్జెక్టులకు ఈ 24 పేజీల పరిమితిని దృష్టిలో ఉంచుకుని ప్రిపరేషన్ సాగించాల్సి ఉంటుంది. గతంలో లాగా అదనపు పేజీలు అడిగే అవకాశం లేకపోవడంతో, విద్యార్థులు అనవసరమైన వివరణలు తగ్గించి మార్కులకు తగినట్లుగా సమాధానాలు రాయడం ప్రాక్టీస్ చేయాలి.

పరీక్షల సమయపాలనలో మాత్రం ఎలాంటి మార్పులు చేయలేదు. ఎప్పటిలాగే ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు కొనసాగుతాయి. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని, కొత్తగా ప్రవేశపెట్టిన బుక్‌లెట్ విధానంపై అవగాహన పెంచుకోవాలని బోర్డు స్పష్టం చేసింది. ఈ నిబంధనల వల్ల పరీక్షల నిర్వహణలో మరింత పారదర్శకత పెరుగుతుందని, పేపర్ల మూల్యాంకనం కూడా సులభతరం అవుతుందని విద్యాశాఖ భావిస్తోంది.

# ఎమ్మెల్యే యార్లగడ్డ పై దుష్ప్రచారం చేస్తే సహించేది లేదు : సర్పంచ్ గండికోట



**గన్నవరం, ఫిబ్రవరి 12 (ఎల్లో సింగం ప్రతినిధి) :** నీతికి, నిజాయితీకి మారుపేరుగా నిలుస్తున్న గన్నవరం శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు పై వైసీపీ నాయకులు అసత్య ప్రచారం చేస్తే సహించేది లేదని అంబాపురం గ్రామ సర్పంచ్ గండికోట సీతయ్య తీవ్రంగా హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..., గన్నవరంలోని ఓ రైతు బజార్ అంశాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం వక్రీకరిస్తూ, అనుకూల మీడియా వేదికగా వైసీపీ నాయకులు చేస్తున్న దుష్ప్రచారాన్ని సీతయ్య ఖండించారు. ఎమ్మెల్యేపై తప్పుడు ఆరోపణలు చేస్తే ప్రజలు నమ్మేస్తారని భావించడం వైసీపీ నాయకుల అపోహ మాత్రమేనన్నారు. నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రతి గ్రామాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్తున్న ప్రజానాయకుడిగా యార్లగడ్డ వెంకట్రావు పేరు తెచ్చుకుంటున్నారని తెలిపారు. ఆయనకు పెరుగుతున్న ప్రజాదరణను తట్టుకోలేకే వైసీపీ నాయకులు బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. తన వ్యక్తిగత వ్యాపారాలను పక్కనపెట్టి ప్రజాసేవకు అంకితభావంతో పని చేస్తున్న నాయకుడు యార్లగడ్డ వెంకట్రావు అని, రోజుకు 20 గంటలకు పైగా ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే పేరు చెప్పి వసూళ్లు చేస్తున్నారనే ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని స్పష్టం చేశారు. నిజంగా ఎమ్మెల్యే తప్పుచేసి ఉంటే తగిన ఆధారాలు చూపాలని వైయస్సార్ సీపీ నాయకులకు సవాల్ విసిరారు. రాజకీయ లబ్ధికోసం ఆధారాలు లేకుండా ఆరోపణలు చేస్తే ప్రజలు సహించరని, ఇప్పటికే వైసీపీ నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాలను మానుకోవాలని హెచ్చరించారు. రాబోయే కాలంలో ప్రజలే వారికి బుద్ధి చెబుతారని అన్నారు. ఎంత దుష్ప్రచారం చేసినా ప్రజలు నిజాన్ని గుర్తిస్తారని సీతయ్య విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మండల రాజేష్, మాజీ ఎంపీపీ తోడేటి రూబెన్, టిడిపి సీనియర్ నాయకులు చిలుఊరి ప్రభాకర్, వసంత్, ఎన్ కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

# బాల్యాన్ని గుర్తుచేసుకొన్న ముదినేపల్లి మండలాధ్యక్షుడు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి










**ఏలూరు జిల్లా ముదినేపల్లి:::: క్రైం కౌంటర్ న్యూస్ ప్రతినిధి::::** బాల్యాన్ని గుర్తుచేసుకొన్న ముదినేపల్లి మండలాధ్యక్షుడు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి పెదపాలపర్రు లోని ఈదర శోభనాద్రి చౌదరి మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో వశిష్ఠ చార్టీబుల్ ట్రస్ట్ వారి సహాయం తో ట్రస్టు చైర్మన్ పీతా నాగేంద్ర విద్యార్థిని,విద్యార్థులుకి పాఠశాల ఆవరణలో ఆటలు ఆడుకొనుటకు గాను స్తంబాలు,ఆటలకు సంభందించిన సామాగ్రీ, ఆటలు ఆడుకొనేనుందుకు వీలుగా 30జతల బట్టలని ఇవ్వగా పాఠశాల డ్రిల్ మాస్టారు వి.భాస్కరరావు ప్రత్యేక శ్రద్దతొ పిల్లలకు ఆటలపై ప్రత్యేక దృష్టి కల్పిస్తూ ముందుకు నడిపిస్తున్నారు. పాఠశాల చైర్మెన్ బొప్పన నరసింహమూర్తి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలుగుదేశం పార్టీ ముదినేపల్లి మండలాధ్యక్షుడు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి విచ్చేసి విద్యార్థిని,విద్యార్దులకు బట్టలని పంచిపెట్టి, చదువుతో పాటుగా ఆటలు కూడా ఆరోగ్యానికి,మానసిక వికాసానికి, శారీరకముగా పిల్లలు ఎదుగుదలకు ఆటలు దోహధపడతాయన్నారు. ఆటల పోటీలలో కూడా పాల్గొని మంచి గుర్తిపు తెచ్చుకొన్నాకూడా ప్రభుత్వ సంస్థలో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని, ప్రతి ఒక్కరూ మంచిగా చదువుకొని,ఆటలలో కూడా పాల్గొని పాఠశాలకు మంచి పేరు తీసుకు రావాలని మంచి ఉన్నత ఉద్యోగాలు పొంది పాఠశాలకు,తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకు రావాలని కోరారు.అనంతరం విద్యార్థిని,విద్యార్థులతొ కలసి ఆటలలో పాల్గొని ఆడి తన బాల్యాన్ని గుర్తుచేసుకొని,కుళ్ళు,కల్మషం,కుట్రలు,కుతంత్రాలు లేని ఎకైక శాశ్వత బంధం స్నేహమని,భవిష్యత్తు లో కూడా ఒకరికి ఒకరిగా అందరూ కలసి స్నేహంతొ కలసి,మెలసి వుడాలని చెప్పారు.ఈ కార్యక్రమంలో,పూర్వ విద్యార్థి పాఠశాల అభివృద్ధి కమిటీ మెంబర్, రిటైర్డ్ ఉద్యోగి డైట్ ప్రిన్సిపాల్,మరియు డివో ఈవో, గన్నమనేని వెంకటేశ్వరరావు, నక్కల్ అధ్యాపాకులు,విద్యార్థిని,విద్యార్థులు,తెలుగుదేశం పార్టీ నాయకులు,కార్యకర్తలుపాల్గొన్నారు

# బాలలు బడిలో ఉండాలి రోడ్లపై కాదు : డా. సి. హెచ్. సూర్య చక్రవేణి

## బాలలతో భిక్షాటన చేయించటం చట్ట విరుద్ధం...





**ఏలూరు, ఫిబ్రవరి 12 (క్రైం కౌంటర్ ప్రతినిధి) :** ఏలూరు జిల్లా మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా బాలల సంరక్షణ యూనిట్ (డిసిపియు) చైల్డ్ హెల్ప్ లైన్--1098 ద్వారా గురువారం ఏలూరు పట్టణంలో బాలల తో భిక్షాటన చేసే వారిని గుర్తించటానికి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ డ్రైవ్ లో నలుగురు పిల్లలతో భిక్షాటన చేస్తూ ఉన్న ఒక తల్లిని మరియు తన బిడ్డతో భిక్షాటన చేయిస్తున్న మరొక మహిళను గుర్తించారు. జిల్లా బాలల సంరక్షణ అధికారి డా. సి. హెచ్. సూర్య చక్రవేణి ఆధ్వర్యంలో సదరు మహిళలకు కౌన్సిలింగ్ నిర్వహించి వివరాలు తెలుసుకుని, చదువు విలువ తెలియజేసి వారి పేర్లు నమోదయి ఉన్న బడులకు పంపించమని వచ్చే విద్యా సంవత్సరంలో హాస్టల్ లో జాయిన్ చేయటానికి చర్యలు తీసుకోవాలని సిబ్బందికి తెలియజేసి ప్రతిదినం పర్యవేక్షిస్తామని చెప్పి పిల్లలను తల్లికి అప్పగించారు. మరొక మహిళ విషయంలో సంబంధిత ప్రాంతంలోని అంగన్‌వాడీ టీచర్ మరియు గ్రామ సచివాలయం మహిళా సంరక్షణ కార్యదర్శికి కుటుంబ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అంతవరకూ సదరు మహిళను, బాబును హోమ్ లో పెట్టడం జరిగింది. ఈసందర్భంగా జిల్లా బాలల సంరక్షణ అధికారి డా. సి. హెచ్. సూర్య చక్రవేణి మాట్లాడుతూ..., బాలలతో భిక్షాటన చేయించడం చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. ప్రజలు ఎవరైనా బాలలు భిక్షాటన చేస్తూ కనిపిస్తే వారికి నగదు ఇవ్వకుండా, వెంటనే ఉచిత సేవ అయిన చైల్డ్ హెల్ప్ లైన్--1098 లేదా పోలీస్ హెల్ప్ లైన్--112 కు సమాచారం ఇవ్వాలని కోరారు. భిక్షాటన నుండి రక్షించబడిన బాలలకు (డిసిపియు) ద్వారా కౌన్సిలింగ్ నిర్వహించి, వారిని తిరిగి అంగన్‌వాడీ కేంద్రాలు మరియు పాఠశాలల్లో చేర్పించే చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. బాలల విద్య మరియు సంరక్షణ విషయాల్లో విద్యాశాఖ, అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామ సచివాలయం మహిళా సంరక్షణ కార్యదర్శులు సమన్వయంతో నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తున్నారని తెలిపారు. అలాగే బాలల భిక్షాటన నివారణపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు కరపత్రాలు, పోస్టర్లు మరియు మైక్ ప్రకటనల ద్వారా ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. “బాలలు బడిలో ఉండాలి -- రోడ్లపై కాదు” అనే లక్ష్యంతో ఏలూరు జిల్లాను బాలల భిక్షాటన రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు కట్టుదిట్టమైన చర్యలు కొనసాగిస్తామని తెలిపారు. ఈ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో వైవి రాజు, కుమారి, సునీత, శంకర్ సిబ్బంది పాల్గొన్నారు.

# సేంద్రియ సాగుతో డబుల్ ధమాకా..!

**ఇటు రైతుకు, అటు వినియోగదారులకూ మేలు..**
**ఆరోగ్యకర వ్యవసాయ ఉత్పత్తులతో సుస్థిర ఆదాయం..**
**మామిడి రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి..**
**రాయితీపై ఫ్రూట్ కవర్లు పంపణీ..**
**ఉద్యాన పథకాలను సద్వినియోగం చేసుకోవాలి..**
**ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ**





**ఎన్‌టీఆర్ జిల్లా,రెడ్డిగూడెం,ఫిబ్రవరి 12(క్రైం కౌంటర్ బ్యూరో చీఫ్ సల్మాన్):** వ్యవసాయంలో రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకాన్ని తగ్గించి, సేంద్రియ పద్ధతులను అవలంబించడం ద్వారా అటు రైతులకు, ఇటు వినియోగదారులకు 'డబుల్ ధమాకా' లాంటి మేలు జరుగుతుందని ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు.
గురువారం కలెక్టర్ లక్ష్మీశ తిరువూరు ఆర్‌డీవో కె.మాధురితో కలిసి రెడ్డిగూడెం మండలం, రంగాపురం గ్రామంలో పర్యటించి, మామిడి తోటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతు ఉత్పత్తిదారుల సంస్థల (ఎఫ్‌పీవో) అభ్యుదయ రైతులతో మాట్లాడి ఫ్రూట్ కవర్ల వినియోగం, ప్రయోజనాలను అడిగి తెలుసుకున్నారు. స్వయంగా మామిడి కాయలకు ఫ్రూట్ కవర్లు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ మామిడి రైతుల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని.. ఉద్యాన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఫ్రూట్ కవర్లు వల్ల ఎలాంటి మచ్చ లేని, మంచి రంగుతో పరిమాణంలో మామిడి దిగుబడి ఉంటుందన్నారు. హెక్టారుకు 15 వేల కవర్లను 50 శాతం రాయితీతో ప్రభుత్వం అందిస్తోందన్నారు. ఇలాంటి మామిడికి మార్కెట్లో మంచి రేటు ఉంటుందని, వినియోగదారులకు కూడా మంచి నాణ్యమైన ఆరోగ్యకర పండ్లు లభిస్తాయన్నారు. నిమ్మకాయ సైజులో కాయ ఉన్నప్పుడు కవర్ కట్టడం వల్ల పండ్ల ఈగలు, ఇతర కీటకాలు కాయను ఆశించలేవని.. దీనివల్ల రైతుకు పురుగుమందుల ఖర్చు బాగా తగ్గుతుందని, రసాయన అవశేషాలు లేని పండ్లు ఉత్పత్తి అవుతాయని వివరించారు. మామిడి రైతులు కూడా 100 శాతం ప్రకృతి సేద్య విధానాలను అనుసరించాలని ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. జిల్లా అధికార యంత్రాంగం కృషితో ప్రభుత్వం మామిడి సేకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేసినందుకు మామిడి రైతులు ధన్యవాదాలు తెలియజేశారు. మామిడి రైతులకు ఇబ్బంది కలిగిస్తున్న కోడి పేనుపై దృష్టిసారిస్తున్నామని, శాస్త్రవేత్తల సహకారంతో చర్యలు తీసుకుంటామని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి పి.బాలాజీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# గవర్నర్ ప్రసంగం 'విజన్ 2047'కు మార్గదర్శకం ఎమ్మెల్యే యార్లగడ్డ



**గన్నవరం ఫిబ్రవరి 12 (క్రైం కౌంటర్ ప్రతినిధి) :** అసెంబ్లీ లో రెండో రోజు గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై గన్నవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావ్ అసెంబ్లీలో కీలక ప్రసంగం చేశారు. గవర్నర్ ప్రసంగం కేవలం ఒక ప్రకటన కాదని, అది 'విజన్ 2047' దిశగా రాష్ట్రం సాగాల్సిన స్పష్టమైన మార్గదర్శకమని ఆయన పేర్కొన్నారు. గత ప్రభుత్వ పాలనలో నెలకొన్న అంధకారం నుంచి రాష్ట్రాన్ని గట్టెక్కిస్తూ, కేవలం 20 నెలల్లోనే రూ.4,498 కోట్ల విద్యుత్ బకాయిలను చెల్లించడంతో పాటు విద్యుత్ ఛార్జీలను తగ్గించిన ఘనత తమ ప్రభుత్వానిదేనని ఆయన స్పష్టం చేశారు.రాష్ట్రానికి 13.25 లక్షల కోట్ల పెట్టుబడుల ద్వారా 16 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా అడుగులు పడుతున్నాయని వివరించారు. విశాఖపట్నం, అమరావతి, తిరుపతి వంటి మూడు ప్రధాన అభివృద్ధి కారిడార్ల ద్వారా రాష్ట్ర ప్రగతిని పరుగులు తీయిస్తున్నామని, అమరావతిని శాశ్వత రాజధానిగా పునరుద్ధరించడమే కాకుండా పోలవరం పనులను వేగవంతం చేశామని గుర్తుచేశారు. పారిశ్రామిక రంగంలో 8.74 లక్షల కోట్ల ప్రాజెక్టులకు ఆమోదం లభించిందని, అలాగే ప్రతి నియోజకవర్గంలో (ఎం ఎస్ ఎం ఈ) పార్కుల ఏర్పాటు జరుగుతోందని తెలిపారు. మెగా డీఎస్సీ ద్వారా 15,941 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ, క్వాంటం వ్యాలీ, ఏఐ మరియు డ్రోన్ స్కిల్ సెంటర్ల ఏర్పాటు భవిష్యత్తు అవసరాలకు నిదర్శనమని వెంకట్రావ్ కొనియాడారు. గతంలో వివాదాస్పదమైన ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను రద్దు చేసి ప్రజల ఆస్తులకు భరోసా కల్పించామని, శాంతిభద్రతల పరిరక్షణ ద్వారా పెట్టుబడిదారులలో నమ్మకాన్ని పెంచామని ఆయన చెప్పారు. మొత్తానికి ఈ ప్రభుత్వం సంక్షేమంతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను సృష్టిస్తూ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతోందని ఆయన తన ప్రసంగంలో స్పష్టం చేశారు. గత ఐదేళ్ల పాలనలోని అనిశ్చితికి తెరదించుతూ, ప్రస్తుత ప్రభుత్వం స్థిరత్వం మరియు అభివృద్ధి లక్ష్యంగా అడుగులు వేస్తోందని గత ప్రభుత్వ హయాంలో ఆడంబరపు ప్రకటనలు తప్ప, ఆచరణలో లోపాలు స్పష్టంగా కనిపించేవని విమర్శించారు. ముఖ్యంగా ఉద్యోగులకు సకాలంలో జీతాలు అందక ఇబ్బంది పడటం, విద్యా వ్యవస్థను బలోపేతం చేయాల్సింది పోయి ఉపాధ్యాయులను బోధనేతర పనులకు పరిమితం చేయడం వంటి చర్యలు రాష్ట్ర ప్రగతిని కుంటుపరిచాయని మండిపడ్డారు. గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన 18 మెడికల్ కాలేజీలు నిధుల కొరతతో మధ్యలోనే నిలిచిపోగా, అభివృద్ధి పనుల కంటే సలహాదారుల వ్యవస్థకే వందల కోట్లు ఖర్చు చేయడం విమర్శలకు దారితీసిందని ఎద్దేవా చేశారు. ముఖ్యంగా పోలవరం ప్రాజెక్టు విషయంలో జరిగిన జాప్యం వల్ల ప్రాజెక్టు వ్యయం రెట్టింపు అయ్యే పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాజెక్టు ఆలస్యమైతే అయ్యే నష్టాన్ని మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి గుర్తించకపోవడం రాష్ట్రానికి తీరని లోటుగా మారిందన్నారు. అయితే, నేడు పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉందని ప్రభుత్వ నిర్ణయాల్లో స్పష్టత, అమలులో వేగం కనిపిస్తోందని చెప్పుకొచ్చారు. ప్రజల అవసరాలకు తగ్గట్లుగా అభివృద్ధి, ఉపాధి కల్పన మరియు బాధ్యతాయుతమైన పాలనను అందిస్తూ ప్రజల్లో కోల్పోయిన నమ్మకాన్ని ఈ ప్రభుత్వం తిరిగి సంపాదిస్తోందన్నారు. ప్రస్తుత బడ్జెట్ సైతం ఇదే అభివృద్ధి దిశగా రాష్ట్ర భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తోందని ఎమ్మెల్యే యార్లగడ్డ పేర్కొన్నారు.

# కార్మిక హక్కులను హరించే లేబర్ కోడ్స్ రద్దు చేయాలి : కళ్ళం వెంకటేశ్వరరావు

**గన్నవరం ఫిబ్రవరి 12 ( క్రైం కౌంటర్ ప్రతినిధి) :** కార్మిక హక్కులను హరించే లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కార్మిక వర్గం పోరాడి సాదించుకున్న కార్మిక చట్టాలను కొనసాగించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు కళ్ళం వెంకటేశ్వరరావు అన్నారు. భారత కార్మిక సంఘాలు తలపెట్టిన సమ్మె లో బాగంగా గురువారం గన్నవరం మండల కేంద్రంలో భారీ ప్రదర్శన సభ నిర్వహించారు. తొలుత స్థానిక చింతపల్లి పాపారావు భవనం నుండి వందలాది మంది కార్మికుల తో ప్రారంభం అయిన ప్రదర్శన గాంధీ బొమ్మ సెంటర్ నుండి ఆర్టీసీ బస్టాండ్, రైతు బజారు వరకు వెళ్ళి తిరిగి గాంధీ బొమ్మ సెంటర్ నుండి అంబేద్కర్ సెంటర్ మీదగా తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరింది. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మల్లంపల్లి ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన సభలో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ..., దేశంలో మూడవ సారి గద్దె నెక్కిన మోడీ కార్మికుల పై, కర్షకుల పై దాడి చేయడమే పరిపాలనగా కొనసాగిస్తున్నాడని దానిలో భాగమే కార్మిక చట్టాల రద్దు, కార్మిక కోడ్ లు అమలు అని అన్నారు. ఈ కోడ్ లు అమలులో కి వస్తే కార్మికుల హక్కులు హరించి కార్మికులను కార్పొరేట్ యాజమాన్యానికి బానిసలుగా అప్పగిస్తుందని అన్నారు. ఉపాధి చట్టాన్ని మార్చి గ్రామీణ కర్మికుల ఉసురు తీస్తుందని విమర్శించారు. దేశంలో నేటికీ వ్యవసాయమే ప్రదాన వనరుగా ఉందని, అలాంటి వ్యవసాయం లో నూతన విత్తన చట్టం ద్వారా, అలాగే విధ్యుత్ సవరణ బిల్లులు ద్వారా రైతులను వ్యవసాయం నుండి తొలగించి కార్పోరేట్ సంస్థల కు వ్యవసాయాన్ని కట్టబెట్టే కుట్రలు చేస్తుందని, ఈ విధమైన కేంద్ర ప్రభుత్వ కార్మిక, కర్షక వ్యతిరేక విధాలకు నిరసనగా ఈ సమ్మె జరుగుతుంది అని, ఈ సమ్మె ద్వారా కేంద్ర ప్రభుత్వానికి హెచ్చరిక చేయడమే సమ్మె ఉద్దేశం అని అన్నారు.
రైతు సంఘం నాయకులు ఎం ఉమా మహేశ్వరరావు మాట్లాడు తూ మోనార్క్ గా వ్యవరించే మోడీ రైతుల పోరాటానికి తలవంచ వలసి వచ్చింది అని ఆ నాటి రైతు పోరాట స్ఫూర్తితో కార్మిక, కర్షకులు అందరు సమిష్టి పోరాటమే సమస్యల పరిష్కారానికి మార్గం అని అన్నారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ బాద్యులు పిల్లి మహేశ్వరరావు (మహేష్) మాట్లాడుతూ..., ప్రజా సమస్య లను ప్రభుత్వానికి, ప్రభుత్వ సందేశాన్ని ప్రజలకు చేరవేస్తూ ప్రజలకు ప్రభుత్వానికి వారధి లా పని చేసే పాత్రికేయులకు రక్షణ లేకుండా పోతుంది




అని, కనీస అవసరాలు అయిన నివేశన స్థలాలు, కుటుంబ ఆరోగ్య పరిరక్షణ కు కుటుంబ ఆరోగ్య కార్డు లు, ప్రైవేట్ విద్యా సంస్థల లో విద్యకు రాయితీ లాంటి కనీస సౌకర్యాలు కూడా అందక సాగ లేక సాగుతున్న జీవితాలకు పరిష్కారం చూపాలని, కీలకమైన అక్రిడేషన్ ను వాయిదాలు లేకుండా పరిష్కారం చేయాలని కోరుకుంటూ నేటి కార్మిక వర్గ సమ్మె కు ఎపి వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ గా పూర్తి మద్దతు నిస్తున్నామని, మా పోరాటానికి మీ అందరు సహకరించాలని కోరారు, కాట్రగడ్డ రామచంద్ర జోషి మాట్లాడారు. ఈ కార్యక్రమం లో బిల్డింగ్ వర్కర్స్, అంగన్వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన పథకం, విఓఎలు, గ్రామ పంచాయతీ, మఠా, సివిల్ సప్లై, రిక్షా, రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు మరియదాసు, నాగలక్ష్మి, స్వాతి, భవాని, వీరమ్మ,సమ్మక్క, లలితకుమారి, పద్మ, గణేష్, చిన రాజు, శ్రీనివాస్, వీరంకి శ్రీనివాస్, ఓ శివ శంకర్, ఆవుటపల్లి సాంబయ్య, నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు. సూరంపల్లి పారిశ్రామిక కేంద్రంలో పరిశ్రమలు అన్నీ మూత పడగా పెద్ద సంఖ్యలో కార్మికులు మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమం లో బెజవాడ తాతబ్బాయి, కె ఏసుదాసు,బి కొండలు, నాగరాజు, రమేష్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# సంక్రాంతి లక్కీడ్రా కేసులో అంబటికి 14 రోజుల రిమాండ్

**క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 12 :** వైసీపీ సీనియర్ నేత అంబటి రాంబాబుకు మరో కేసులో రిమాండ్ పడింది. 2023లో సత్తెనపల్లిలో సంక్రాంతి సంబరాల సందర్భంగా నిర్వహించిన లక్కీ డ్రా కేసులో గుంటూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ కోర్టు ఆయనకు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. వైసీపీ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న సమయంలో, 2023 జనవరిలో అంబటి రాంబాబు సంక్రాంతి సంబరాల పేరుతో లక్కీ డ్రా నిర్వహించారు. ఈ సందర్భంగా వాలంటీర్ల ద్వారా పింఛనుదారుల నుంచి రూ.200 చొప్పున అక్రమంగా వసూలు చేసి, వారికి బలవంతంగా లాటరీ టికెట్లు అంటగట్టారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంపై జనసేన పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు కోర్టులో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.ప్రస్తుతం మరో కేసులో రాజమండ్రి సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న అంబటిని, పోలీసులు పీటీ వారెంట్‌పై ఇవాళ గుంటూరు కోర్టులో హాజరుపరిచారు. కేసు వివరాలను పరిశీలించిన న్యాయమూర్తి ఎం. కుముదిని, ఆయనకు 14 రోజుల రిమాండ్ విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు. కోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో అంబటిని తిరిగి రాజమండ్రి జైలుకు తరలించారు.సీఎం చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యల కేసులో బెయిల్ లభించగా, గతేడాది మెడికల్ కాలేజీ అంశంపై నిర్వహించిన ఆందోళనల్లో పోలీసులతో దురుసుగా ప్రవర్తించారన్న కేసులోనూ ఆయనకు బెయిల్ లభించింది. ఈ రెండు కేసుల్లో బెయిల్ రావడంతో అంబటి విడుదల కావడం లాంఛనమేనని అందరూ అనుకున్నారు. అయితే, పోలీసులు సంక్రాంతి లక్కీ డ్రా కేసులో పీటీ వారెంట్ పై కోర్టును ఆశ్రయించగా, న్యాయమూర్తి రిమాండ్ విధించడంతో అంబటికి నిరాశే మిగిలింది. తాజా రిమాండ్‌తో ఆయన విడుదల ఆగిపోయింది.

# తిరుపతి లడ్డూ నెయ్యి సరఫరాపై సీఎం చంద్రబాబును ప్రశ్నించిన భూమన

**క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 12 :** తిరుపతి లడ్డూ ప్రసాదం తయారీకి ఉపయోగించే నెయ్యి ధర, నాణ్యత విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు రెండు నాల్కల ధోరణి అవలంబిస్తున్నారని వైసీపీ తీవ్రంగా విమర్శించింది. టీటీడీ మాజీ ఛైర్మన్, వైసీపీ నేత భూమన కరుణాకర్ రెడ్డి గురువారం మీడియాతో మాట్లాడుతూ ఈ ఆరోపణలు చేశారు.గతంలో 2014-19 మధ్య చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు, ఆయన కుటుంబానికి చెందిన హెరిటేజ్ ఫుడ్స్ తయారీ యూనిట్ అయిన ఇందాపూర్ ఫుడ్స్ అండ్ డెయిరీ ప్రొడక్ట్స్.. టీటీడీకి కేజీ నెయ్యిని రూ. 278 నుంచి రూ. 306 ధరలకే సరఫరా చేసిందని భూమన గుర్తుచేశారు. రూ. 300 లోపు నాణ్యమైన నెయ్యి ఎలా వస్తుందని ఇప్పుడు ప్రశ్నిస్తున్న చంద్రబాబు, ఆనాడు సరఫరా చేసిన నెయ్యి నాణ్యతపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.ఆశ్చర్యకరంగా, ఎన్డీయే అధికారంలోకి వచ్చాక మళ్లీ అదే యూనిట్ సరఫరాదారుగా వచ్చి, ఇప్పుడు కేజీ నెయ్యిని ఏకంగా రూ. 658కి సరఫరా చేస్తోందని భూమన ఆరోపించారు. చంద్రబాబు బాధ్యతలు స్వీకరించిన తర్వాత హెరిటేజ్ తయారీ యూనిట్, కర్ణాటకకు చెందిన మరో



సంస్థతో కలిసి టీటీడీకి నెయ్యి సరఫరా చేస్తోందని తెలిపారు.గతంలో రూ. 278కి సరఫరా చేసినప్పుడు నాణ్యమైనదిగా భావించి, ఇప్పుడు ధరను రూ. 658కి ఎలా పెంచారని.. దీని వెనుక ఏదైనా వ్యాపార ఒప్పందం ఉందా అని సీఎం సమాధానం చెప్పాలని భూమన నిలదీశారు. గతంలో చంద్రబాబు హయాంలో ఈ రెండు యూనిట్లు 40 లక్షల కేజీలకు పైగా నెయ్యి సరఫరా చేసినట్లు సీబీఐ ఛార్జ్‌షీట్‌లో ఉందని, దీనిపై ఆయన వివరణ ఇవ్వాలని భూమన డిమాండ్ చేశారు

# అధిక తేమతో పంటలకు ముప్పు



**క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 12 :** పంటల ఆరోగ్యకరమైన పెరుగుదలకు నేలలో తగినంత తేమ ఉండటం ఎంత అవసరమో, అది పరిమితి దాటితే అంతే ప్రమాదకరం. క్షేత్రస్థాయిలో నీరు నిల్వ ఉండటం వల్ల మట్టిలోని ఖాళీ ప్రదేశాలన్నీ నీటితో నిండిపోయి, గాలి ప్రసరణకు ఆస్కారం లేకుండా పోతుంది. దీనివల్ల మొక్కల వేర్లకు అందాల్సిన ఆక్సిజన్ నిలిచిపోయి, అవి ఊపిరి అందక ఉక్కిరిబిక్కిరి అవుతాయి. ఈ పరిస్థితి మొక్క ప్రాథమిక జీవక్రియలపై తీవ్ర ప్రభావం చూపుతుంది.

నేలలో నీరు అధికంగా నిలిచినప్పుడు శ్వాసక్రియ మందగించి, వేర్లు క్రమంగా బలహీనపడతాయి. బలహీనమైన వేర్ల వ్యవస్థపై హానికరమైన శిలీంధ్రాలు, బ్యాక్టీరియా సులభంగా దాడి చేస్తాయి, దీనినే మనం 'వేరుకుళ్లు' వ్యాధిగా పిలుస్తాము. వేర్లు కుళ్లిపోవడం ప్రారంభమయ్యాక మొక్క పోషకాలను గ్రహించే శక్తిని కోల్పోతుంది. ఫలితంగా మొక్క పెరుగుదల అగిపోవడమే కాకుండా, చివరకు పూర్తిగా ఎండిపోయి చనిపోయే ప్రమాదం ఉంది.

ముఖ్యంగా వాణిజ్య పంటలు మరియు కూరగాయల సాగులో ఈ సమస్య తీవ్రత ఎక్కువగా కనిపిస్తుంది. టమాటా, మిర్చి, వంకాయ వంటి కూరగాయల మొక్కలతో పాటు కీరదోస వంటి పాదులకు అధిక తేమ శత్రువుగా మారుతుంది. అలాగే పండ్ల తోటలైన బత్తాయి, ద్రాక్ష వంటి వాటిలో కూడా వేరుకుళ్లు సమస్య సోకితే దిగుబడి గణనీయంగా పడిపోతుంది. రైతులు నీటి యాజమాన్య పద్ధతులపై దృష్టి సారించకపోతే భారీ నష్టాలను మూటగట్టుకోవాల్సి వస్తుంది.

పంట పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం ద్వారా ఈ ముప్పు నుంచి బయటపడవచ్చు. మురుగునీటి పారుదల సౌకర్యం సరిగ్గా ఉన్నప్పుడే వేర్లకు గాలి ఆడి, మొక్క ఆరోగ్యంగా పెరుగుతుంది. నేల స్వభావాన్ని బట్టి నీటి తడులను ప్లాన్ చేసుకోవడం, వర్షకాలంలో పొలంలో నీరు నిలవకుండా బయటకు పంపేలా కాలువలు ఏర్పాటు చేసుకోవడం అత్యవసరం. సరైన జాగ్రత్తలు తీసుకుంటేనే నాణ్యమైన దిగుబడిని సాధించి, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవచ్చు.

## అప్రమత్తంగా ఉంటేనే కూరగాయల పంటల్లో ఆశించే తెగుళ్ల నివారణ సాధ్యం



**క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 12 :** ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో కూరగాయల సాగు చేసే రైతులు వివిధ రకాల పురుగులు మరియు తెగుళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. ముఖ్యంగా కూరగాయ పంటలను ఆశించే అక్షింతల పురుగు మరియు చిత్తపురుగుల ఉధృతిని గమనించి సకాలంలో నివారణ చర్యలు చేపట్టాలి. సాధారణ కూరగాయ పంటల్లో వీటి నివారణకు ప్రతి లీటరు నీటికి 2 మి.లీ. క్లోరిఫైరిఫాస్ కలిపి పిచికారీ చేయడం ద్వారా ఆశించిన ఫలితాలను పొందవచ్చు. తద్వారా పంట ఎదుగుదల సక్రమంగా ఉండి దిగుబడి పెరిగే అవకాశం ఉంటుంది.

పంట రకాలను బట్టి వాడే మందుల మోతాదులో మార్పులు ఉంటాయని రైతులు గమనించాలి. ముఖ్యంగా వంగ, కాకర, ఆగాకర వంటి తీగ జాతి మరియు ఇతర కూరగాయ పంటలకు క్లోరిఫైరిఫాస్ అంతగా ప్రభావం చూపకపోవచ్చు. కావున, ఈ నిర్దిష్ట పంటలకు లీటరు నీటికి 1 గ్రాము థయోడికార్బ్ కలిపి పిచికారీ చేసుకోవడం శ్రేయస్కరం. ఇలా పంటను బట్టి సరైన మోతాదులో పురుగుమందులను వాడటం వల్ల ఖర్చు తగ్గడమే కాకుండా మొక్కలకు తగిన రక్షణ లభిస్తుంది.

కూరగాయల్లో పురుగుల సమస్యతో పాటు ఎండుతెగులు కూడా రైతులకు పెద్ద సవాలుగా మారుతోంది. ప్రధానంగా మిరప, టమాటా, క్యాబేజీ వంటి పంటలు ఈ తెగులు బారిన పడే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఎండుతెగులు ఆశించినప్పుడు మొక్కలు క్రమంగా వాడిపోయి చనిపోయే ప్రమాదం ఉంది. దీని నివారణకు కేవలం పైన పిచికారీ చేయడం సరిపోదు, మందును నేరుగా మొక్కల మొదళ్లలో పోయాల్సి ఉంటుంది. దీనివల్ల వేరు వ్యవస్థ బలపడి తెగులు వ్యాప్తిని సమర్థవంతంగా అరికట్టవచ్చు.

నివారణ మందుల విషయానికొస్తే, లీటరు నీటికి 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా 2 గ్రాముల మెటాలాక్సిల్ ం మాంకోజెబ్ మిశ్రమాన్ని కలిపి మొక్కల మొదళ్లలో తడపాలి (డ్రెంచింగ్). ఇలా శాస్త్రీయ పద్ధతులను పాటించడం వల్ల తెగుళ్ల ఉధృతి తగ్గుతుందని నిపుణులు చెబుతున్నారు. రైతులు స్వయంగా నిర్ణయాలు తీసుకోకుండా, పంట దశను బట్టి వ్యవసాయ అధికారుల సలహాలను పాటిస్తూ మందులను వాడాలి. సరైన సమయంలో స్పందిస్తే తక్కువ పెట్టుబడితో నాణ్యమైన కూరగాయల దిగుబడిని సాధించవచ్చు.

# బాపులపాడులో విజయవంతమైన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె









**హనుమాన్ జంక్షన్, ఫిబ్రవరి 12 (క్రైం కౌంటర్ ప్రతినిధి) :** బాపులపాడు మండలం, హనుమాన్ జంక్షన్ లో గురువారం నాడు కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 4 లేబర్ కోడ్స్ రద్దుచేయాలని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా సిపిఎం పార్టీ మండలం కార్యదర్శి బేతా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..., దేశంలో ఉద్యోగులు కార్మి కుల పట్ల చాలా వివక్షత కొనసాగుతున్నదని అన్నారు. కార్మికులకు దాదాపు 12 సంవత్సరాలుగా కనీస వేతన చట్టాన్ని సవరించలేదని , ప్రభుత్వం పెట్టుబడిదారులకు మాత్రం లక్షల కోట్ల రూపాయలు రాయతిలిస్తూ వారిని మరింత ధనవంతులు గా మారుస్తున్నదని అన్నారు , కార్మికులకు కనీస వేతనాలు సంక్షేమ పథకాలు అమలు చేయకుండా, మొండి చేయి చూపిందని విమర్శించారు బ్రిటిష్ కాలం నుంచి కొనసాగిన కార్మిక చట్టాలను బిజెపి ప్రభుత్వం రద్దు చేయడం దుర్మార్గమైన చర్య అని తెలిపారు ..సమాజ సేవకు పౌష్టికాహారాన్ని అందిస్తున్న అంగన్వాడీలకు ఇంటింటికి ఆరోగ్య సేవలు చేస్తూ ప్రజా ఆరోగ్యాన్ని కాపాడుతున్న ఆశ వర్కర్లకు, కేంద్ర ప్రభుత్వం పది సంవత్సరాలుగా వేతనాలు పెంచకుండా జాప్యం చేస్తున్నదని అన్నారు. స్కీం వర్కర్లకు వి ఆర్ ఏ లకు కనీస వేతనం 26,000 అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమ్మె హక్కును నిర్వీర్యం చేస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు కార్మిక వర్గం రానున్న ఎన్నికల్లో గుణపాఠం చెబుతుందని హెచ్చరించారు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తున్న నరేంద్ర మోడీ ప్రభుత్వం పతనం అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు సిఐటియు నాయకులు నల్లి రాజనాల, సురేష్, మధు ఆంజనేయులు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు అబ్దుల్ భారీ, బర్రె లెనిన్, ఆశ కార్యకర్తలు, అంగన్వాడి టీచర్స్, పెద్ద సంఖ్యలో ప్రజలు సమ్మెలో పాల్గొన్నారు.

# ఘనంగా ఎమ్మెల్యే బడేటి చంటి జన్మదిన సంబరాలు






**ఏలూరు, ఫిబ్రవరి 12 (క్రైం కౌంటర్ ప్రతినిధి) :** ఏలూరు నగరంలో పండుగ వాతావరణంగా ఏలూరు ఎమ్మెల్యే, టిడిపి జిల్లా అధ్యక్షులు బడేటి చంటి పుట్టిన రోజు సందర్భంగా సంబరాలు మిన్నంటాయి. పేదల అభ్యున్నతే లక్ష్యంగా నిరంతరం పాటుపడుతూ చివరకు పుట్టినరోజున కూడా పేదల సంక్షేమమే పరమావధిగా భావించి రాష్ట్ర శాసన సభా సమావేశాలకు ఎమ్మెల్యే హాజరైనప్పటికీ ఆయన తరపున పలు సేవా కార్యక్రమాలు నిర్వహించి టిడిపి నాయకులు, కార్యకర్తలు, బడేటి అభిమానులు, కుటుంబ సభ్యులు అందరికీ ఆదర్శంగా నిలిచారు. పలుచోట్ల కేక్ కటింగ్‌లు, అన్నదానాలు, సేవా కార్యక్రమాలతో నగరంలో సందడి వాతావరణం నెలకొంది. దీనిలో భాగంగా ఏలూరు పవర్ పేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ఉదయం ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో ఎమ్మెల్యే సోదరుడు, రాష్ట్ర వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు బడేటి వెంకట్రామయ్య, ఎమ్మెల్యే చంటి సతీమణి బడేటి మీనాలు భారీ కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం ఎమ్మెల్యే సొంత నిధులతో భారీగా ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరాన్ని ఈడా చైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్ ప్రారంభించారు. ఏలూరు ఆశ్రం ఆసుపత్రి వైద్యులు పెద్దసంఖ్యలో పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించారు. ముఖ్యంగా కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఆపరేషన్లు ఉచితంగా నిర్వహించాలని నిర్ణయించడంతో పాటూ పలువురికి ఉచితంగా కళ్ళజోళ్ళు పంపిణీ చేశారు. అలాగే జనరల్ ఫిజిషియన్ల ఆధ్వర్యంలో అన్నిరకాల వ్యాధులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మాజీ మంత్రి మరడాని రంగారావు చేతులమీదుగా ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఇదేసమయంలో బిపి, షుగర్ టెస్టులు నిర్వహించి అవసరమైన సలహాలు, సూచనలు అందించడంతో పాటూ మందులు ఉచితంగా అందజేశారు. ఆ తర్వాత బడేటి ట్రస్ట్ ఆధ్వర్యంలో 22 మంది పేదలకు తోపుడు బళ్ళను, ముగ్గురికి కుట్టు మిషన్లను, ఒక వీల్ చైర్‌ను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా రాష్ట్ర వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు బడేటి వెంకట్రామయ్య మాట్లాడుతూ..

నిత్యం ప్రజాసేవలోనే ఉండాలని ఆకాంక్షించే తన సోదరుడు, ఎమ్మెల్యే బడేటి చంటి అసెంబ్లీ సమావేశాలకు హాజరైనందున ఆయన తరపున పుట్టిన రోజు పురస్కరించుకుని పలు సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. నిస్వార్థమైన సేవలకు తార్కాణంగా నిలవాలనే సంకల్పంతోనే తమకిచ్చిన సూచనల మేరకు అవసరార్థులకు ఉపయుక్తమైన సేవలను అందించామన్నారు. ఇదేవిధంగా రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

ఎమ్మెల్యే బడేటి సతీమణి మీనా మాట్లాడుతూ..

తన భర్త ఆకాంక్షకు అనుగుణంగా ఆయన పుట్టిన రోజున పేదలకు సేవలు అందించాలన్న లక్ష్యంతో ఈ సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొన్నారు.

రాష్ట్ర మాలల ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు మాట్లాడుతూ..

బడేటి అంటే భరోసా అనే నానుడికి అనుగుణంగా ఎన్నో ఏళ్ళ నుండి పేదల సంక్షేమానికి ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తూ వస్తున్నారని కొనియాడారు.

ఎఎంసి చైర్మన్ మామిళ్ళపల్లి పార్థసారధి మాట్లాడుతూ..

డైనమిక్ ఎమ్మెల్యే బడేటి చంటి పుట్టినరోజును పురస్కరించుకుని పేదల కళ్ళల్లో ఆనందం చూడాలనే ఆలోచనతోనే ఈ సేవాకార్యక్రమాలను నిర్వహించినట్లు చెప్పారు. దీనికి అందరూ సహకారం అందించినట్లు వెల్లడించారు.

ఏలూరు నగర టిడిపి అధ్యక్షులు చోడే వెంకటరత్నం మాట్లాడుతూ...

గత ఎన్నికల్లో రికార్డు స్థాయి మెజార్టీతో తనకు పట్టంకట్టిన ఏలూరు నియోజకవర్గ ప్రజల రుణాన్ని తీర్చుకునేందుకు ఎమ్మెల్యే బడేటి చంటి నిరంతరం పాటుపడుతున్నారని కొనియాడారు. రానున్న రోజుల్లో ఆయన మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు.

జిల్లా పార్టీ అధికార ప్రతినిధి పూజారి నిరంజన్ మాట్లాడుతూ...

ఎమ్మెల్యే బడేటి చంటి నాయకునిగానే కాకుండా ఒక సేవకుడిగా ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ వస్తున్నారని, ఇదేక్రమంలో సేవాగుణాన్ని స్ఫూర్తిగా అందిరికీ పంచుతున్నారని కొనియాడారు.

మహిళా నాయకులు తవ్వా అరుణకుమారి, కడియాల విజయలక్ష్మి మాట్లాడుతూ..

పేదలకు సేవ చేయాలన్న తలంపు ఉన్న నాయకుడు ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి అని ప్రశంసించారు.

ఈకార్యక్రమంలో పార్టీ పరిశీలకులు మీరావలీ, జిల్లా టిడిపి మీడియా కో-ఆర్డినేటర్ చల్లా వెంకట సత్యవరప్రసాదరావు, పార్టీ జిల్లా కార్యాలయ కార్యదర్శి ఉప్పాల జగదీష్‌బాబు, పార్టీ నగర కార్యదర్శి రెడ్డి నాగరాజు, మోటేపల్లి చంద్రశేఖర్, కోటేశ్వరమ్మ దంపతులు, బెల్లపుకొండ కిషోర్, శ్రీలక్ష్మి దంపతులు, కో-ఆప్షన్ సభ్యులు ఎస్సెమ్మార్ పెదబాబు, చోడే వెంకటరత్నం, ప్రధాన కార్యదర్శి రెడ్డి నాగరాజు మరియు కార్పొరేటర్లు, క్లస్టర్ ఇంచార్జిలు, డివిజన్ ఇంచార్జీలు, బూత్ ఇన్చార్జులు, అనుబంధ సంఘాల సభ్యులు, బడేటి అభిమానులు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006. Published by Katikala Vara Prasad. at H No: 21-119, West Ibrahimpatnam, Krishna, Andhra Pradesh - 521456. . Editor. Katikala Vara Prasad. RNI- 2015/62250, Reg No: APTEL/25/A2844. Ph:9849707349 email:kvp6858@gmail.com